సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం ၊ 11 ၊ సెప్టెంబర్ ၊ 2023



టీబీ డ్యాంలో 69 టీఎంసీల నీరు

తుంగభద్ర జలాశయంలో ఆదివారం నాటికి 69.807 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



టమాట కిలో రూ.10

అనంతపురం అగ్రికల్చర్: కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.3.50, సరాసరిన రూ.6.50 చొప్పున క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.6°/21.3°

జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. ఎక్కడా వర్షం కురవలేదు.

న్యూస్‌రీల్

జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

పుట్టపర్తి అర్బన్: టీడీపీ అధినేత చంద్రబాబు రిమాండు నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా నిరసనలు, ధర్నాలకు అనుమతి లేదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన



పుట్టపర్తి అర్బన్: జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయితో పాటు డివిజన్, మండల స్థాయిలోనూ స్పందన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. అర్జీపై ఆధార్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు.

ఎస్పీ కార్యాలయంలోనూ..

జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందన ఉంటుందని, ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా వచ్చి అర్జీలు సమర్పించుకోవచ్చునని ఎస్పీ మాధవరెడ్డి ఓ ప్రకటనలో సూచించారు.

పచ్చదనం... బొగ్గుపాలు

ఇష్టారాజ్యంగా చెట్ల నరికివేత

- బొగ్గుగా మార్చి ఇతర ప్రాంతాలకు రవాణా
- భారీగా సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు



కనగానపల్లి మండలం మామిళ్లపల్లి సమీపంలో బొగ్గుల తయారీ కోసం కట్టెలు కాలుస్తున్న దృశ్యం

కనగానపల్లి: కట్టెల బొగ్గుకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. దీన్ని అక్రమార్కులు చక్కగా సొమ్ము చేసుకుంటున్నారు. పచ్చని చెట్లను నిలువునా నరికేస్తూ బొగ్గుగా మార్చేస్తున్నారు. దీని వల్ల పచ్చదనం కనుమరుగవడంతో పాటు పర్యావరణానికీ హాని కలుగుతోంది.

ఎక్కడెక్కడంటే..

మండల కేంద్రం కనగానపల్లి, కుర్లపల్లి, మామిళ్లపల్లి, దాదులూరు, తగరకుంట తదితర గ్రామాల సమీపంలోని చెరువులు, కుంటలతో పాటు వ్యవసాయ పొలాల్లోని ముళ్ల చెట్లు, కలపకు ఉపయోగపడని చెట్లను నరికి వాటితో బొగ్గు తయారు చేస్తున్నారు. రొద్దం మండలం కోగిర, కంబాలపల్లితో పాటు ధర్మవరం, లేపాక్షి, పరిగి తదితర మండలాల పరిధిలోనూ ఇదే పరిస్థితి ఉంది. బొగ్గుల తయారీకి ఏకంగా బిహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొస్తున్నారు. జేసీబీలతో చెట్లను తొలగించి బట్టీలు ఏర్పాటు చేసి అక్కడే కాల్చి బొగ్గు తయారు చేస్తున్నారు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

జిల్లా పరిధిలో తయారవుతున్న బొగ్గులను ఎక్కువగా లారీలు, ట్రక్కుల ద్వారా మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, కర్ణాటక తదితర రాష్ట్రాల్లోని ఫ్యాక్టరీలకు రవాణా చేస్తున్నారు. ఫ్యాక్టరీల్లోని బాయిలర్లతో పాటు బంగారు ఆభరణాల తయారీ, ఇతరత్రా అవసరాలకు వీటిని వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల వీటికి మంచి ధర లభిస్తోంది. వ్యాపారులు కిలో రూ.100 వరకు విక్రయిస్తున్నారు. కట్టెల బొగ్గు తయారీకి కొన్ని రాష్ట్రాల్లో అనుమతి లేకపోవటంతో అక్కడి నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి బొగ్గు తయారీ చేయించుకుని వాహనాల్లో తరలించుకుపోతున్నారు. చాలాచోట్ల అధికారుల అనుమతి కూడా తీసుకోకుండానే బయట ప్రాంతాలకు తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అటవీ, పోలీసు శాఖల అధికారులు కూడా దీనిపై ప్రత్యేక నిఘా పెట్టకపోవటంతో అక్రమ దందా యథేచ్ఛగా సాగిపోతోంది.



బొగ్గులను కుప్పపోసిన దృశ్యం

పర్యావరణానికి ముప్పు

గ్రామాలకు సమీపంలోని చెరువులు, వ్యవసాయ పొలాల దగ్గరే బొగ్గుల బట్టీలు ఏర్పాటు చేశారు. వీటి నుంచి పెద్దఎత్తున వచ్చే పొగ చుట్టు పక్కల ప్రాంతాలకు వ్యాపిస్తోంది. దీనివల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడుతోందని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇక ముళ్ల చెట్లను తొలగిస్తామని రైతులకు చెప్పి..పనిలో పనిగా పొలాల్లోని మిగిలిన చెట్లను కూడా నరికేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే అధికారులు, రైతులకు తెలియకుండా కొందరు మధ్యవర్తులకు కమీషన్లు ఇచ్చి చెరువులు, కుంటల్లోని చెట్లను రాత్రికిరాత్రే నరికి బొగ్గుగా మార్చేస్తున్నారు.



బొగ్గులను తీసుకెళ్తున్న లారీ

దీనివల్ల వ్యాపారులతో పాటు మధ్యవర్తులు కూడా లాభపడుతున్నారు.

వన్యప్రాణుల స్థావరాలు ధ్వంసం

చెరువులు, కుంటల్లోని చెట్లను, ముళ్ల పొదలను నాశనం చేస్తుండడంతో అక్కడ వన్య ప్రాణులు ఏర్పాటు చేసుకున్న స్థావరాలు కూడా ధ్వంసమైపోతున్నాయి. దీనివల్ల నెమళ్లు, జింకలు, కుందేళ్లు, అడవిపందులు, ఎలుగుబంట్లు లాంటివి జనావాసాల్లోకి వస్తున్నాయి. అలాగే వేటగాళ్లకు సులువుగా దొరికి మృత్యువాతపడుతున్నాయి. బొగ్గుల దందాపై అటవీ శాఖ అధికారులను వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా..ఎవరూ అందుబాటులోకి రాలేదు.

బొగ్గుల తయారీకి ఎవరికీ అనుమతి ఇవ్వలేదు

"చెరువులు, కుంటల్లోని చెట్లు కొట్టి బొగ్గు తయారు చేసుకోవటానికి ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల పరిధిలో ఉండే ప్రాంతాల్లోని ముళ్ల చెట్లు కొట్టాలన్నా స్థానిక అధికారుల అనుమతి ఉండాలి. మాకు తెలియకుండా ఎవరైనా అక్రమంగా చెట్లు కొట్టి బొగ్గులు తయారు చేస్తుంటే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. – వెంకటరమణ, ఇరిగేషన్ డీఈ, చెన్నేకొత్తపల్లి డివిజన్

న్యాయవ్యవస్థపై నమ్మకం పెరిగింది

- ఏజీపీ భాస్కరరెడ్డి



మాట్లాడుతున్న ఏజీపీ భాస్కరరెడ్డి

పెనుకొండ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం సూత్రధారి చంద్రబాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించడంతో ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం పెరిగిందని పెనుకొండ కోర్టు ఏజీపీ భాస్కర రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసు నుంచి తప్పించుకోవడానికి చంద్రబాబు అనేక ప్రయత్నాలు చేశారన్నారు. చాలా విషయాల్లో ఆయన అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఏసీబీ కోర్టు తీర్పుపై ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవినీతి కేసుల్లో చంద్రబాబు కోర్టు ముందు నిలబడక తప్పదన్నారు. 2014లో సీఎంగా బాధ్యతలు స్వీకరించిన రెండు నెలల్లోనే స్కాంకు పాల్పడ్డారంటేనే, ఆయన అంతకుముందు ఎన్ని కుంభకోణాలకు తెరతీసి ఉంటారో అర్థం చేసుకోవచ్చన్నారు. త్వరలోనే ఆయన బండారం బయటపడుతుందని స్పష్టం చేశారు. ఎవరెన్ని కుట్రలు చేసినా సీఎం జగన్‌ను ఏమీ చేయలేరని, ప్రజల దీవెనలే ఆయనకు శ్రీరామ రక్ష అని భాస్కరరెడ్డి పేర్కొన్నారు.



నృత్యనాటిక ప్రదర్శిస్తున్న చిన్నారులు

ప్రేమకు ప్రతి రూపం సాయి

ప్రశాంతి నిలయం: అమ్మ ప్రేమ వంటి కమ్మనైన ప్రేమను భక్తకోటికి పంచి వారి మదిలో సత్యసాయి శాశ్వతంగా కొలువయ్యారన్న సందేశాన్నిస్తూ ప్రదర్శించిన నృత్యనాటిక భక్తులను పరవశింపజేసింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన ఏలూరు జిల్లా సత్యసాయి భక్తులు రెండో రోజు ఆదివారం సాయంత్రం ప్రశాంతినిలయంలోని సాయి కుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. ఏలూరు జిల్లా బాలవికాస్ చిన్నారులు, సత్యసాయి యూత్ బృందం సంయుక్తంగా 'మాతృదేవోభవ' నృత్య నాటిక ప్రదర్శించారు. మాతృమూర్తి తన బిడ్డపై ఎలాంటి ప్రేమ కల్గిఉంటారో.. సత్యసాయి కూడా తన భక్తకోటిపై అలాంటి ప్రేమ వాత్సల్యాలను చూపారంటూ చక్కటి ఘట్టాలను ప్రదర్శించారు. కళాకారులకు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు జ్ఞాపికలతో పాటు నూతన వస్త్రాలను బహూకరించారు.



నాటికలోని ఒక ఘట్టం

బాబు పెద్ద అవినీతిపరుడు

- 'స్కిల్' కుంభకోణం సూత్రధారి అతనే
- నిరుద్యోగులకు అందాల్సిన ఫలాలను నొక్కేసిన ఘనుడు
- చట్టపరిధిలో కఠిన శిక్ష తప్పదు
- ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: మాజీ సీఎం చంద్రబాబు పెద్ద అవినీతిపరుడని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం మొత్తం ఆయన కనుసన్నల్లోనే జరిగిందన్నారు. రూ.371.25 కోట్ల ప్రజాధనాన్ని షెల్ కంపెనీల ద్వారా స్వాహా చేశారని, తాను ఇదే విషయాన్ని గతంలో అసెంబ్లీ వేదికగా ఆధారాలతో సహా నిరూపించానని కేతిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ధర్మవరంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. 2014 ఆగస్టులో అప్పటి సీఎం చంద్రబాబుకు సన్నిహితుడు ఇల్లెందు రమేష్ జర్మనీ కంపెనీ అయిన సీమెన్స్ భారత్ విభాగంలో పని చేస్తున్న సుమన్‌బోస్, డిజైన్‌టెక్ ఎండీ వికాస్ ఖాన్విల్కర్‌లను పరిచయం చేసి నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేశారన్నారు. ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.3,356 కోట్లు అవుతుందని, ఇందులో ఏపీ ప్రభుత్వం 10 శాతం, సీమెన్స్ కంపెనీ 90 శాతం నిధులు ఖర్చు పెట్టేలా చర్చించుకున్నారన్నారు. కొద్దిరోజులకే స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా చంద్రబాబుకు సన్నిహితుడు గంటా సుబ్బారావును నియమించి.. 2015 ఫిబ్రవరి 16న ఈయన ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు అనుమతించాలని ఒక నోట్ పెట్టించారన్నారు. టేబుల్ అజెండాలో ఈ అంశం లేకున్నా ప్రాజెక్టుకు ఆమోదం తెలుపుతూ 2015 జూన్ 30న ప్రభుత్వం జీవో ఎంఎస్ 4ను విడుదల చేసిందన్నారు. ప్రాజెక్టు విధి విధానాలు, డీటైల్డ్ రిపోర్ట్ తదితర అంశాలు పరిగణనలోకి తీసుకోకుండానే ప్రభుత్వ వాటాగా రూ.330 కోట్లు ఐదు దశల్లో విడుదల చేశారన్నారు. ఆశ్చర్యమేమిటంటే ఈ ఐదు దశల్లో సీమెన్స్, డిజైన్ టెక్ కంపెనీ చెల్లించాల్సిన 90 శాతం వాటా నిధులలో పైసా కూడా విడుదల చేయలేదని తెలిపారు. పైగా విడుదల చేసిన ప్రభుత్వ నిధులను షెల్ కంపెనీల ద్వారా మళ్లీ బాబుకే చేరవేశారన్నారు. ఏపీ ప్రభుత్వంతో సీమెన్స్ పేరుతో కుదుర్చుకున్న ఈ ఒప్పందం గురించి సదరు కంపెనీ యాజమాన్యానికే తెలియదన్నారు. సీమెన్స్ కంపెనీ అంతర్గత విచారణలోను, కేంద్రం, జీఎస్టీ అధికారులు జరిపిన తనిఖీలలోనూ స్కిల్ స్కాం గుట్టు రట్టయ్యిందన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేసిన చంద్రబాబుకు చట్ట పరిధిలో కఠిన శిక్ష తప్పదని ఎమ్మెల్యే కేతిరెడ్డి స్పష్టం చేశారు. స్కిల్ కుంభకోణం బాబు గారి చిన్న ముక్క మాత్రమేనని, ఇంకా అమరావతిలో భూ అక్రమాలు, ఏపీ ఫైబర్ గ్రిడ్‌తో పాటు అనేక కుంభకోణాలు త్వరలోనే వెలుగు చూస్తాయని చెప్పారు.



స్కిల్ కుంభకోణంలో చంద్రబాబు పాత్రపై ఆధారాలతో సహా వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

చంద్రబాబుకు రిమాండ్ సబబే

- ఎమ్మెల్యే శంకరనారాయణ



పెనుకొండ: అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రజాధనాన్ని లూటీ చేసిన చంద్రబాబుకు కోర్టు తగిన శిక్ష వేసిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. తప్పు చేసిన వ్యక్తి ఎంతోకాలం తప్పించుకుని తిరగలేడని, ఇన్నాళ్లు స్టేలతో కేసుల నుంచి తప్పించుకు తిరిగిన చంద్రబాబుకు నేడు తగిన శాస్తి జరిగిందని అన్నారు. స్కిల్ కుంభకోణం కేసు నుంచి బయటపడడానికి చంద్రబాబు నానా యాగీ చేశాడని, అయితే చట్టం ముందు అడ్డంగా దొరికిపోయారని అన్నారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందన్నారు. ఆర్థిక నేరగాడిగా చంద్రబాబు రాష్ట్ర ప్రజల్లో నిలిచిపోవడం ఖాయమన్నారు. సొంతమామ ఎన్టీఆర్‌నే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు నేడు తగిన గుణపాఠం దక్కిందన్నారు.

పాపం పండింది

- ఎమ్మెల్యే తిప్పేస్వామి



మడకశిర: ఎట్టకేలకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు పాపం పండిందని ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు డాక్టర్ తిప్పేస్వామి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు పెద్ద అవినీతిపరుడని ఏసీబీ కోర్టు నిర్ణయంతో రుజువైందన్నారు. ముఖ్యమంత్రిగా ఎన్నో అక్రమాలకు ఆయన పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజాధనాన్ని దోచుకుని రూ.కోట్లకు పడగలెత్తారని ధ్వజమెత్తారు. చట్టాలకు దొరకకుండా ఇన్నాళ్లు తప్పించుకుని తిరిగారన్నారు. కాంగ్రెస్‌తో కుమ్మక్కై వైఎస్ జగన్‌పై తప్పుడు కేసులు పెట్టించారని ఆరోపించారు. చివరికి తాను తవ్వుకున్న గోతిలో తానే పడ్డారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఆయన అవినీతి, అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కోరారు. అలాంటి వ్యక్తి జైలుకు వెళ్లడం రాష్ట్ర ప్రజల విజయమని తెలిపారు. అవినీతిపరుడు చంద్రబాబును పవన్ కల్యాణ్ వెనుకేసుకుని రావడం హాస్యాస్పదమన్నారు. కోర్టు తీర్పును రాష్ట్ర ప్రజలు సహృదయంతో ఆహ్వానిస్తున్నారని స్పష్టం చేశారు.

'చంద్రబాబు పాలనంతా అవినీతిమయమే'



సాక్షి, పుట్టపర్తి: చంద్రబాబు పాలనంతా అవినీతిమయమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత కోటా సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. వ్యవస్థలను మేనేజ్ చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని, ప్రజాధనాన్ని దోపిడీ చేయడం ఆయన నైజమని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఆయన పాచికలు పారలేదన్నారు. ఇన్నేళ్లకు ఆయన పాపం పండిందని, ఫలితంగా జైలుకు వెళ్లాడని పేర్కొన్నారు. చంద్రబాబు అప్‌డేట్ కాలేదని, అవుట్‌డేటెడ్ వెర్షన్‌లో ఉన్నారని ఎద్దేవా చేశారు.

రిజిస్ట్రేషన్ మరింత సులభతరం

- కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌తో రిజిస్ట్రేషన్‌తోపాటే మ్యుటేషన్
- ప్రజలకు మరింత చేరువగా నూతన విధానం
- ఈ నెల 15 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అమలు



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నూతన కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ విధానాన్ని ప్రవేశపెడుతోంది. ఈ విధానంలో రిజిస్ట్రేషన్ సేవలు సులభతరం కావడంతోపాటు వినియోగదారులకు కచ్చితత్వంతో కూడిన లావాదేవీలతో పాటు అవినీతి అక్రమాలకు తావులేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పారదర్శకంగా ఉండనుంది. 24 ఏళ్ల క్రితం రిజిస్ట్రేషన్ శాఖ కార్డ్ అనే సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశపెట్టి స్థిరాస్తులను క్రయ, విక్రయదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేస్తూ వస్తోంది. వినియోగదారులకు ఖర్చు భారాన్ని తగ్గించేందుకు నాలుగేళ్ల క్రితం పీడీఈ (పబ్లిక్ డేటా ఎంట్రీ) స్థిరాస్తి కొనుగోలుదారులే తమ డాక్యుమెంట్లను రూపొందించుకునే నూతన విధానాన్ని తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత చేరువ చేసింది. తాజాగా కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. వినియోగదారులు ఎంచుకున్న సమయంలోనే 20 నిమిషాల వ్యవధిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయనుంది. నూతన విధానం అమ్మకందార్లతోపాటు కొనుగోలుదారులకు సైతం ఎటువంటి తప్పులూ దొర్లకుండా రిజిస్ట్రేషన్ మరింత పారదర్శకం కానుంది.

ఆటోమేటిక్‌గా మ్యుటేషన్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా వ్యవసాయ భూములు కొనుగోలు చేసుకొని వినియోగదారులు దగ్గరలోని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకుంటారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు లబ్ధిదారు చేతికి వచ్చిన తర్వాత తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి అక్కడి రెవెన్యూ అధికారులను సంప్రదించి కొత్త పట్టాదారు పాసుపుస్తకాల కోసం మ్యుటేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత 40 రోజుల్లోపు భూమి కొనుగోలుదారుకు పాసుపుస్తకాలను మంజూరు చేస్తారు. ప్రస్తుత తరుణంలో రిజిస్ట్రేషన్ శాఖ ప్రవేశపెట్టిన నూతన సాఫ్ట్‌వేర్‌తో రెవెన్యూ అధికారులను సంప్రదించకుండానే కొనుగోలుదారు చిరునామాకు పది రోజుల్లోనే పట్టాదారు పాసుపుస్తకాలు ఇంటికే వచ్చేస్తాయి. వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ అయిన వెంటనే కొనుగోలుదారుకు డాక్యుమెంట్లు వెంటనే చేతికి రావడంతోపాటు రిజిస్ట్రేషన్ అవగానే ఆటోమేటిక్‌గా డాక్యుమెంట్లు మ్యుటేషన్‌కు వెళ్లిపోతాయి.

- మ్యుటేషన్‌కు వెళ్లిన డాక్యుమెంట్లు వెంటనే రెవెన్యూ అధికారుల లాగిన్‌కు వెళ్తాయి. వారు అక్కడ నిర్ణీత సమయంలోగా ఆమోదించాల్సి ఉంటుంది. వారు ఆమోదించిన వెంటనే 10 రోజుల్లోపు 1బీ, అడంగల్‌లో కొత్తగా భూమి కొనుగోలు చేసిన వ్యక్తి పేరు రావడంతోపాటు నూతన పట్టాదారు పాసుపుస్తకాలు సైతం నేరుగా ఇంటికే వచ్చేస్తాయి. ఈ విధానం ఈ నెల 15న ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా అమల్లోకి రానుంది. వ్యవసాయేతర భూములు, వ్యవసాయ భూములు కొనుగోలు చేసే వినియోగదారులకు ఈ నూతన కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్ మంచి ప్రయోజనకరంగా మారనుంది.

కమనీయం.. అంజన్న రథోత్సవం

బొమ్మనహాళ్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నేమకల్లు ఆంజనేయస్వామి రథోత్సవం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున 5.30 గంటలకు ఉత్సవ విగ్రహాన్ని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై కొలువుదీర్చి, ఇదే రథంపై నలుగురు పూజారులు కూర్చుని ఉండగా భక్తులు లాగారు. శ్రావణంలో మూడు (కసాపురం, మురడి, నేమకల్లు) ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకున్న భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవాలకు హాజరయ్యారు. భక్తులకు రామాంజనేయ స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ నిర్వాహకులు అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం ఐదు గంటలకు ఆంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు రథాన్ని భక్తిశ్రద్ధలతో లాగి, మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ఏడు గంటలకు లంకాదహనం కార్యక్రమం జరిగింది. స్థానిక ఎస్‌ఐ శివ, డి.హీరేహాళ్ ఎస్‌ఐ రంగడు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నరసింహారెడ్డి, ప్రధాన అర్చకులు వైద్యం అనిల్‌కుమార్ స్వామి, సర్పంచ్ పరమేశ్వర తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో నేమకల్లు ఆంజనేయ స్వామి



అశేష భక్తజన సందోహం నడుమ సాగుతున్న ఆంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవం

క్లుప్తంగా

గుండెపోటుతో రైల్వే టీటీఈ మృతి


మృతుడు వాసు (ఫైల్)

గుత్తి: గుండెపోటుతో రైల్వే టీటీఈ మృతి చెందిన ఘటన గుత్తి ఆర్‌ఎస్‌లో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన వాసు (50) గుంతకల్లు రైల్వేలో టీటీఈ (ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్)గా పని చేస్తున్నాడు. రెండు రోజుల క్రితం ఆయన ఇంట్లో కుప్పకూలి పడిపోయాడు. గుర్తించిన కుటుంబసభ్యులు మొదట గుత్తి రైల్వే ఆసుపత్రికి తర్వాత గుంతకల్లు రైల్వే ఆసుపత్రికి, అనంతరం అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. శనివారం అర్ధరాత్రి వాసు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా, మున్సిపల్ కౌన్సిలర్లు వరదరాజులు, అరవింద్ బాబు, పలువురు నాయకులు ఆయన మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు.

108లో ప్రసవం

- తల్లీ బిడ్డ క్షేమం


శిశువును కుటుంబ సభ్యులకు అందజేస్తున్న 108 సిబ్బంది

హిందూపురం టౌన్: పరిగి మండలం బసనపల్లికి చెందిన ప్రేమ అనే గర్భిణి 108 వాహనంలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఆదివారం ఉన్నఫళంగా ఆమెకు నొప్పులు రావడంతో హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు ప్లేట్‌లేట్స్ తక్కువగా ఉండడంతో మెరుగైన వైద్యానికి అనంతపురం ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. దీంతో 108లో ఆమెను తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో పెనుకొండ సమీపంలో నొప్పులు అధికమయ్యాయి. వాహనాన్ని పక్కకు ఆపి 108 పైలెట్ ఫరీద్ సాయంతో ఈఎంటీ సురేష్ ఆమెకు సాధారణ కాన్పు చేశారు. మగబిడ్డకు ప్రేమ జన్మనిచ్చారు. తల్లీబిడ్డను పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఇద్దరూ క్షేమంగా ఉన్నారని తెలపడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. కాన్పు చేసిన 108 సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య


అశోక్‌కుమార్ (ఫైల్)

మడకశిరరూరల్: భార్య కాపురానికి రాలేదనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని గోవిందాపురంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ లోకేష్ తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన అశోక్‌కుమార్ (29), రొద్దం మండలం తురకలపట్నం గ్రామంలో ఐదు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. భార్య కాపురానికి రమ్మంటే తిరస్కరించింది. దీంతో మనస్తాపం చెంది చెట్టుకు ఉరి వేసుకుని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి సిద్దగంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జై మాతా బీబీ జైనబ్బీ!

- 13 నుంచి ఉరవకొండలో అమ్మవారి ఉరుసు
- హిందూ ముస్లింల ఐక్యతకు ప్రతీక
- రాష్ట్రంలోనే ఏకైక అమ్మవారి దర్గా


ఉత్సవాలకు ముస్తాబైన అమ్మవారి దర్గా

ఉరవకొండ: కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా కీర్తి గడించిన ఉరవకొండ హజరత్ బీబీ జైనబ్బీ ఉరుసు ఉత్సవాలు ఈ నెల 13న ప్రారంభం కానున్నాయి. హిందూ–ముస్లింల సమైక్యతకు ప్రతీకగా అమ్మవారు పూజలందుకుంటున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉరవకొండలో మాత్రమే అమ్మవారికి ప్రత్యేకంగా దర్గా ఉండడం గమనార్హం. అపురూప శిల్పకలలు అందులో కనువిందు చేస్తాయి.

మాతా బీబీ జైనబ్బీ జీవసమాధి కథనమిలా..

బీబీ జైనబ్బీ చరిత్రకి సంబంధించి పలు కథనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. అమ్మవారు కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ వాస్తవ్యులు. ఆమె అపురూప సౌందర్యరాశి. ఉరవకొండ ప్రాంతంలో పర్యటిస్తున్న సమయంలో అక్కడ క్యాంపు వేసిన బ్రిటిష్ సైనికులు దురుద్దేశంతో వెంటపడతారు. దీంతో భూమాతను కాపాడాలని ఆమె వేడుకోగా అక్కడ భూమి రెండుగా చీలింది. దీన్ని గమనించిన ఓ బ్రిటిష్ సైనికుడు భూమిలోకి వెళుతున్న అమ్మవారి జడకుచ్చులను పట్టుకుని లాగడానికి ప్రయత్నించి రక్తం కక్కుకుని మృతి చెందాడు. అక్కడే ఉన్న మిగిలిన సైనికులు కంటి చూపు కోల్పోయారని కథనం. చేసిన తప్పు తెలుసుకున్న బ్రిటిష్ సైనికులు అమ్మవారిని క్షమాభిక్ష ప్రసాదించాలని వేడుకోగా, ఆమె కరుణించి చూపు ప్రసాదించిందని భక్తులు చెబుతారు. అమ్మవారు జీవసమాధి అయిన చోటే బ్రిటిష్ సైనికులు సమాధి ఏర్పాటు చేసి ప్రార్థనలు చేసినట్లు ప్రతీతి.

ఎన్నో ప్రత్యేకతలు..

బీబీ జైనబ్బీ అమ్మవారి దర్గా ప్రత్యేకతలకు నెలవుగా పేరుగాంచింది. అపురూప శిల్పకళతో విరాజిల్లుతోంది. అరబ్ దేశంలోని మక్కా ప్రాంతంలో ఏర్పాటు చేసిన జన్నత్ కాదర్వాజ (స్వర్గద్వారం)ను పోలిన కట్టడాన్ని కర్ణాటక ప్రాంతానికి చెందిన కళాకారులతో ఇక్కడ ఏర్పాటు చేయించారు. దీంతో పాటు కర్ణాటక రాష్ట్రం గుల్బర్గాలోని ఖాజబందే నవాజ్ దర్గా తరహాలో ఉన్న గాజు గోపురాన్ని రూపొందించారు. అజ్మీర్‌లోని ఖాజగరీబ్ నవాజ్ దర్గాలోని దేగ్‌ను అదే తరహాలోనే రూ. 4 లక్షలు వెచ్చించి జైనబ్బీ దర్గాలో ఏర్పాటు చేశారు. దర్గా శిఖర కలశం కూడా ఆకట్టుకుంటోంది.

15 వరకూ వేడుకలు..

జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాలు ఈనెల 13న ప్రారంభమవుతాయని దర్గా కమిటీ అధ్యక్షులు హోతురూ బాషా, సభ్యులు తెలిపారు. మొదటి రోజు గంధం వేడుకలు, 14న ఉరుసు, 15న జియారత్ వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. ప్రసిద్ధి గాంచిన ఖవ్వాలీ దారులతో ఖవ్వాలీ పోటీలు ఉంటాయన్నారు. ఉత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారన్నారు.


మక్కా తరహాలో ఏర్పాటు చేసిన జన్నత్‌కా దర్వాజ


అమ్మవారి జీవసమాధి

'సాఫ్ట్'గా ప్రవేశించి.. రికార్డులు లిఖించి

సాఫ్ట్‌బాల్ క్రీడల్లో నాలుగుసార్లు ఆమె అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటింది. సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించినా.. ఆటపై మక్కువ పెంచుకుని మెరికలా మారి నాలుగు సార్లు పతకాలు సాధించింది. వివాహమైనా క్రీడలకు దూరం కాక ఆత్మవిశ్వాసంతో దూసుకెళ్లింది. ఆ క్రమంలోనే 'లాక్రోస్' ఆట వైపు దృష్టి సారించింది. అక్కడా సత్తా చాటి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొననున్న జట్టుకు ఎంపికైంది.



- సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాధిక ఖండాంతర ఖ్యాతి
- తాజాగా 'లాక్రోస్' ఆటలోనూ సత్తా
- త్వరలో అంతర్జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం
- రాష్ట్రానికి చెందిన తొలి క్రీడాకారిణిగా ఘనత

అనంతపురం: సాఫ్ట్‌బాల్ క్రీడలో నాలుగుసార్లు ఆమె అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటింది. సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించినా.. ఆటపై మక్కువ పెంచుకుని మెరికలా మారి నాలుగు సార్లు పతకాలు సాధించింది. వివాహమైనా క్రీడలకు దూరం కాక అచంచెల ఆత్మవిశ్వాసంతో దూసుకెళ్లింది. ఆ క్రమంలోనే 'లాక్రోస్' ఆట వైపు దృష్టి సారించింది. అక్కడా సత్తా చాటి అంతర్జాతీయ పోటీల్లో పాల్గొననున్న జట్టుకు ఎంపికై ంది. పెద్దపప్పూరు మండలం సోమనపల్లి గ్రామానికి చెందిన జే. రాధిక ఎస్కేయూ పరిధిలో డిగ్రీ పూర్తి చేసింది. సాఫ్ట్‌బాల్ క్రీడలో రాణిస్తూ.. అంచెలంచెలుగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి జట్లకూ ఎంపికైంది. చైనా, అమెరికా దేశాల్లో దేశం తరఫున పాల్గొని రాణించింది. గ్రామీణ ప్రాంతంలోని ఓ మధ్యతరగతి కుటుంబంలో పుట్టినా.. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో ఒక్కో మెట్టు ఎక్కింది. ఈ క్రమంలోనే లాక్రోస్ పోటీలపై మక్కువ పెంచుకున్న ఆమె.. ఆ ఆటలోనూ రాణిస్తూ.. అంతర్జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగింది. ప్రస్తుతం దిల్లీలో శిక్షణ తీసుకుంటోంది. కెనడాలో జరగనున్న పోటీలకు బయలుదేరనుంది.

చిన్న పాప ఉన్నా..

పాఠశాల స్థాయిలో కబడ్డీ, ఖోఖో ఆడుతున్న రాధిక.. పీఈటీల ప్రేరణతో పదేళ్ల క్రితం సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఎంట్రీ ఇచ్చింది. ఆర్డీటీ ప్రోత్సాహంతో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో జాతీయ స్థాయి జట్లలో ప్రాతినిధ్యం వహించింది. ఆమె ప్రతిభను మెచ్చిన సెలెక్టర్లు అంతర్జాతీయ పోటీలకు ఎంపిక చేశారు. చైనాలో రెండు పర్యాయాలు, సింగపూర్, అమెరికాలో ఒక్కసారి చొప్పున అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంది. డిగ్రీ పూర్తికాగానే తల్లిదండ్రులు పెళ్లి చేశారు. ఆమె ఓ పాపకు జన్మనిచ్చింది. వివాహం తర్వాత సాధారణంగా మహిళలు క్రీడలకు స్వస్తి పలుకుతారు. అయితే, రాధిక మాత్రం ఇందుకు భిన్నంగా కుస్తీ పోటీల్లో ప్రవేశించింది.

రాధిక సాధించిన విజయాలు..

- సింగపూర్‌లో జరిగిన అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించి రజత పతకం కైవసం చేసుకుంది.
- చైనాలో 2016,2018లో జరిగిన ఆసియా జూనియర్ బాలికల సాఫ్ట్‌బాల్ ఛాంపియన్ షిప్, ఆసియా విశ్వవిద్యాలయాల సీనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొని ఐదో ర్యాంకు పొందింది.
- 2017లో అమెరికాలో జరిగిన జూనియర్ ప్రపంచ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాధిక పాల్గొంది.
- 2013 నుంచి 2019 నుంచి వరుసగా 14 సార్లు జూనియర్, సీనియర్ విభాగాల్లో జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో సత్తా చాటింది.

సత్తా చాటుతా..

అక్టోబర్ 6,7,8 తేదీల్లో లాక్రోస్ టోర్నమెంట్ కెనడాలోని ఓషావాలో ఉంటుంది. గ్రామీణ ప్రాంతంలో ఓ సాధారణ కుటుంబం నేపథ్యం నాది. పోటీల్లో పాల్గొనాలంటే రూ.3 లక్షల వరకూ ఖర్చు అవుతుంది. స్పాన్సర్లు ఆదుకుంటే కెనడా వెళ్లి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తా. నాకు అవకాశం కల్పించిన రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు. అంతర్జాతీయ పోటీల్లోనూ సత్తా చాటుతాననే నమ్మకం ఉంది.

–జే. రాధిక, క్రీడాకారిణి

విద్యతోనే ఉన్నత శిఖరాలు


ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించడం సాధ్యమవుతుందని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు పీవీ రమణయ్య పేర్కొన్నారు. చదువుల్లో ప్రతిభ కనబరుస్తున్న నాయీ బ్రాహ్మణ విద్యార్థులకు ఆదివారం స్థానిక జయమణెమ్మ కల్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. నాయీ బ్రాహ్మణ విద్యార్థులు ఎవరికీ తీసిపోరని, నైపుణ్యం, సమర్థత, కమ్యూనికేషన్ స్కిల్స్ మన రక్తంలోనే ఉన్నాయన్నారు. ఉన్నత విద్య అభ్యసించి కుల గౌరవం, ప్రతిష్టను మరింత పెంచాలని పిలుపునిచ్చారు. నాయీబ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరంగయ్య మాట్లాడుతూ 2022–23 విద్యాసంవత్సరం 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన 42 మందికి, ఇంటర్‌లో సత్తా చాటిన 8 మంది విద్యార్థులకు రూ.1,000 చొప్పున నగదు ప్రోత్సాహం, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశామన్నారు. తమ సంఘానికి కర్నూలుకు చెందిన సీఐ ఉపేంద్రబాబు రూ.2 లక్షల చెక్‌ను అందజేయడం ఆనందకరమన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షులు సుబ్రమణ్యం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి, రాష్ట్ర కోశాధికారి బాలతాత, గుంటూరు జిల్లా అధ్యక్షుడు దేవ ప్రసాదరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వివేకానందస్వామి, పీటీసీ సీఐ కృష్ణమోహన్, శింగనమల మండల విద్యాధికారి నరసింహరాజు, శ్రీనిధి ఏజీఎం హనుమేష్‌బాబు, డీఆర్‌ఓ కొండయ్య, 50వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్ బాబు, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, శివప్రసాద్, ఆర్టీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ గేయానంద్


డాక్టర్ గేయానంద్

అనంతపురం కల్చరల్: జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన డాక్టర్ గేయానంద్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. రెండు రోజులుగా చీరాలలో జరుగుతున్న జేవీవీ 17వ రాష్ట్ర మహాసభల్లో జేవీవీ జాతీయ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. జేవీవీ ఎన్నికల కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న కోయా వెంకటేష్ గేయానంద్ ఎంపికను ప్రకటించారు. ఈ సందర్భంగా గేయానంద్ 'సాక్షి'తో మాట్లాడుతూ రెండేళ్ల పాటు అధ్యక్ష పదవి ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథం పెంచేలా కార్యక్రమాలను చేపడతామన్నారు. విద్యావిధానంలో శాస్త్రీయత పాటించేలా విధి విధానాలు రూపొందించి ప్రభుత్వాలకు తెలియజేస్తామన్నారు. గేయానంద్‌ను, జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎంపికైన భాస్కర్‌ను రచయితలు, జేవీవీ సభ్యులు అభినందించారు.

అశ్రునయనాలతో జవాను అంత్యక్రియలు


నారాయణస్వామిపై కప్పిన జాతీయ జెండాను భార్య శ్రీవాణికి అప్పగిస్తున్న బీఎస్‌ఎఫ్ అధికారులు


భౌతిక కాయం వద్ద గౌరవ వందనం చేస్తున్న బీఎస్‌ఎఫ్ సిబ్బంది

గార్లదిన్నె: మండల పరిధిలోని పెనకచెర్లడ్యాంలో ఆదివారం బీఎస్‌ఎఫ్ జవాను నారాయణ స్వామి అంత్యక్రియలు అశ్రునయనాల నడుమ ముగిశాయి. అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. అంతిమ యాత్రలో గ్రామస్తులు, స్నేహితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఘన నివాళులర్పించారు. భౌతికకాయం వద్ద బీఎస్‌ఎఫ్ సిబ్బంది గాల్లోకి 3 రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం చేశారు. నారాయణ స్వామిపై కప్పిన జాతీయ జెండాను ఆయన భార్య శ్రీవాణికి అధికారులు అప్పగించారు. ఈ సందర్భంగా భార్య రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

జెడ్పీలోనూ కారుణ్యం!



అనంతపురం సిటీ: కరోనా మహమ్మారి బారిన పడి అకాల మృత్యువాతపడ్డ ఉద్యోగుల వారసులపై ప్రభుత్వం కారుణ్యం చూపింది. వారికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే జిల్లా కలెక్టర్ గౌతమికి ఆదేశాలందాయి. ఇప్పటికే ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లా, మండల పరిషత్ కార్యాలయాలతో పాటు పంచాయతీరాజ్ శాఖ, జెడ్పీ పాఠశాలల్లో పని చేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులు చాలా మంది కరోనాతో ప్రాణాలు కోల్పోయారు.

అంగీకార పత్రాల స్వీకరణ..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 32 మంది కరోనాబారిన పడి మరణించినట్లు తేల్చారు. వారి వారసులకు విద్యార్హతలను బట్టి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశాల మేరకు జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్, డిప్యూటీ సీఈఓ లలితాబాయి ఆధ్వర్యంలో జెడ్పీ 'ఏ' సెక్షన్ ఉద్యోగులు మూడు రోజులుగా కసరత్తు చేస్తున్నారు. చనిపోయిన ఉద్యోగుల వారసులను శనివారం జెడ్పీ కార్యాలయానికి పిలిపించారు. పరిస్థితి వివరించి, అంగీకార పత్రాలు తీసుకున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ అనుమతి తీసుకున్నాక కలెక్టర్ గౌతమికి సమగ్ర నివేదిక పంపనున్నారు. అయితే చాలా మంది జెడ్పీలో పోస్టులు కావాలంటూ విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిసింది.

టీచర్లను బోధనకే వినియోగించాలి


మాట్లాడుతున్న నక్కా వెంకటేశ్వర్లు

రాప్తాడురూరల్: ఉపాధ్యాయులను బోధనకే వినియోగించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ విమర్శించారు. ఆదివారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ప్రాంతీయ వర్క్ షాపు జరిగింది. సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నక్కా వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల పనిదినాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో బోధనా సమయం వృథా అవుతోందన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయకుండా విద్యారంగ అభివృద్ధి సాధ్యం కాదన్నారు. ఉపాధ్యాయులపై బనాయించిన కేసులు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్ ఎంవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ దేవేంద్రమ్మ, ఎన్. శాంతి ప్రియ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగమయ్య, గోవిందరాజులు, శ్రీసత్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.జయచంద్రారెడ్డి, ఎం. సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆ'పాత' మధురమే..

పుట్టపర్తి అర్బన్: పాఠశాల విద్య అనంతరం ఎక్కడెక్కడో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకచోట కలిశారు. గత స్మృతులు గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. పుట్టపర్తి మండలంలోని పెడపల్లి ఉన్నత పాఠశాల 1991–92 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం గెట్ టు గెదర్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆహ్లాదంగా గడిపారు. అప్పట్లో పని చేసిన ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, నారాయణరెడ్డి, చలమన్న, అక్తర్ బాషతో పాటు ప్రస్తుత హెచ్‌ఎం రామచంద్రారెడ్డిని ఘనంగా సన్మానించారు.

20 సంవత్సరాల అనంతరం..

గాండ్లపెంట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 20 సంవత్సరాల అనంతరం ఆదివారం పాఠశాలలో కలిశారు. నేస్తమా.. కుశలమా అంటూ ఒకరినొకరు పలకరించుకున్నారు. రోజంతా ఆహ్లాదంగా గడిపారు. అనంతరం తమకు పాఠాలు చెప్పిన గురువులకు పూలమాలలు వేసి దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనరసు, విశ్వనాథ్, శంకర్ బాబు, ముంతాజ్‌అలీ, ఎల్. రవీంద్రారెడ్డి, లక్ష్మీ ప్రమదారాణి, ఖాదర్‌బాషా, సుబాహానల్లా, వార్డన్ సుబ్బరాయుడు, వలంటీర్లు ఫయాజ్, సిద్దారెడ్డి, ఖలీల్, అమర్‌నాథ్‌రెడ్డి, పూర్వ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


గాండ్లపెంట: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు


గ్రూప్ ఫొటో దిగుతున్న పూర్వ విద్యార్థులు